# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను
http://vaasthavanestham.com
వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...
సంప్రదించండి
తెలంగాణ 8099779988
ఆంధ్రప్రదేశ్ 9985337979
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో
వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన
- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 | సంచిక : 289 | శుక్రవారం 24 మే 2024 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri



- ప్రభుత్వం నిర్ణయంపై ఉత్కంఠ..
- బీసీల లెక్క తేలిన తర్వాతే పంచాయతీ ఎన్నికలు జరపాలన్న డిమాండ్
- అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఒత్తిడి
- ఎన్నికల షెడ్యూల్ తరుముకొస్తుండడం.. అప్పట్లోపు బీసీల కులగనన పూర్తవుతుందా లేదా అన్న సందిగ్ధత
- పంచాయతీ ఎన్నికలను ఆలస్యం చేస్తే రావాల్సిన నిధులు నిలిచిపోతాయి.

# పంచాయతీ పోరుపై కొత్త చిచ్చు



హైదరాబాద్

స్థానిక సమరంపై కాంగ్రెస్‌లో కొత్త చర్చ మొదలయింది. బీసీల లెక్క తేలిన తర్వాతే పంచాయతీ ఎన్నికలు జరపాలన్న డిమాండ్ ఊపు అందుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఒత్తిడి పెరుగుతోంది. అయితే ఎన్నికల షెడ్యూల్ తరుముకొస్తుండడం.. అప్పట్లోపు బీసీల కులగనన పూర్తవుతుందా లేదా అన్న సందిగ్ధత నెలకొంది. ఈ నేపథ్యంలో అసలు స్థానిక ఎన్నికలు జరుగుతాయా లేదా అన్న అనుమానాలు -మిగతా3లో





## చత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- ఏడుగురు నక్సల్స్ మృతి
- దండకారణ్యంలో మావోల కీలక సమావేశం!
- దంతేవాడ-బీజాపూర్ సరిహద్దుల్లో కూంబింగ్ చేపట్టిన భద్రతా బలగాలు
- కాల్పులు జరిపిన మావోలు... దీటుగా స్పందించిన భద్రతా బలగాలు

# హైదరబాద్‌కు తప్పనున్న నీటిగండం

- భగీరథ ప్రయత్నం సక్సెస్ అయితే జులై వరకు డోకా లేదు..!
- ఎడారిలా మారి ఎల్లంపల్లి ప్రాజెక్టు
- ఎన్నడూ లేనంతగా అడుగంటి పోయిన జలాశయం
- భగీరథ ప్రయత్నంతో అప్రోచ్ కాలువల లోతును పెంచి ఇన్‌టెక్ వెల్ లోకి నీరు వచ్చేలా భగీరథ ప్రయత్నం



హైదరాబాద్

రాష్ట్ర రాజధాని హైదరబాద్ తాగునీటి గండాన్ని గట్టెక్కించేందుకు ఎల్లంపల్లి జలాశయ అదికారులు భగీరథ ప్రయత్నమే చేస్తున్నారు. మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల నడుమ గోదావరిపై నిర్మాణమైన ఎల్లంపల్లి మండుతున్న ఎండలతో ఎండి ఎడారిలా మారు తుండటంతో.. ఇన్‌టెక్ కాల్వలకు నీరొచ్చే అవకాశం లేకపోయింది. దీంతో అదనంగా మోటర్లను ఏర్పాటు చేసి కాల్వల్లోకి నీటిని ఎత్తిపోసేందుకు సిద్ధమవుతున్నారు. -మిగతా3లో



## అంగట్లో అమ్మకానికి ఆడబిడ్డ!


కాసుల కక్కుర్తితో కన్న బిడ్డనే కాదనుకున్నారు..

స్టింగ్ ఆపరేషన్‌లో బయటపడ్డ విస్తుపోయే వాస్తవాలు

రెండు నెలల చిన్నారిని అమ్మకాని పెట్టిన ఘటన కలకలం

హైదరాబాద్

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ శివారులో రెండు నెలల చిన్నారిని అమ్మకాని పెట్టిన ఘటన కలకలం రేపుతుంది. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసకున్న పోలీసులు ధర్యాప్తు చేస్తున్నారు. మేడ్చల్ జిల్లా లో అమానుష ఘటన జరిగింది. మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో 60రోజుల -మిగతా3లో



## ఆదివారానికల్లా తీవ్ర తుపానుగా అల్పపీడనం

- రెమల్ తుపానుగా నామకరణం!
- ప్రస్తుత సీజన్ లో రుతుపవనాలకు ముందు ఏర్పడుతున్న తొలి తుపాన్
- పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ మధ్య తీరం దాటే చాన్స్
- సముద్రంలోకి వెళ్లవద్దని మత్స్యకారులకు వాతావరణశాఖ హెచ్చరిక

# టీజీ సిరీస్‌కు మంచి గిరాకీ


- 09 9999 నంబర్ ప్లేట్ వేలం..
- ధర చూస్తే మైండ్ బ్లోయింగ్..
- 9999 నెంబరు కోసం లక్షల కుమ్మరింపు

హైదరాబాద్

తెలంగాణలో వాహన రిజిస్ట్రేషన్ ఫ్యాన్సీ నంబర్లకు గిరాకీ భారీగా పెరిగింది. కేవలం ఒక్క వాహనం రిజిస్ట్రేషన్ కోసం లక్షల్లో డబ్బులు ఖర్చు చేస్తున్నారు నగరవాసులు. దీంతో కొత్త సిరీస్ వాహన రిజిస్ట్రేషన్ నంబర్ ను వేలం నిర్వహించారు రవాణా శాఖ అధికారులు. ఇందులో చాలా మంది పాల్గొన్నారు. హైదరాబాద్‌లో ప్రముఖ వ్యాపార వేత్తలు, సినీ రాజకీయ ప్రముఖులు ఇలా చాలా మంది సుసంపన్నులు నివసిస్తున్నారు. తాజాగా ఆర్టీవో ఆఫీస్ ఆన్లైన్‌లో నిర్వహించిన రిజిస్ట్రేషన్ వేలంలో ఒక ఫ్యాన్సీ నంబర్?ను ప్రముఖ సోనీ ట్రాన్స్ పోర్ట్ సొల్యూషన్ సంస్థ కొనుగోలు చేసింది. హైదరాబాద్ నగర పరిధిలోని ఖైరతాబాద్ ప్రాంతీయ రవాణా కార్యాలయం (ఆర్‌టీఓ)లో నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో ఫ్యాన్సీ వాహన రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్ ధర అక్షరాలా రూ. 25.5 కు -మిగతా3లో



# ఆదివారానికల్లా తీవ్ర తుపానుగా అల్పపీడనం



బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం మరింతగా బలపడుతోందని.. అది తీవ్ర తుపానుగా మారి ఆదివారం సాయంత్రానికి పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ ల మధ్య తీరం దాటే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రకటించింది. ప్రస్తుత సీజన్ కు సంబంధించి రుతుపవ నాలకు ముందు ఏర్పడుతున్న మొట్టమొదటి తుపాన్ ఇదేనని అధికారులు తెలిపారు. హిందూ మహా సముద్రంలో ఏర్పడే తుపానులకు పెట్టే పేర్ల క్రమంలో.. ప్రస్తుతం ఉన్న పేరు రెమల్. దీనిని ఈ తుపానుకు పెట్టనున్నట్టు వెల్లడించారు.

**శనివారానికల్లా తుపానుగా మారి..**

బంగాళాఖాతంలో అల్పపీడనం పరిస్థితిపై ఐఎండీ శాస్త్రవేత్త మోనికా శర్మ మాట్లాడారు. "మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం శుక్రవారం ఉదయానికల్లా వాయుగుండంగా మారుతుంది. తర్వాత మరింత బలపడి శనివారం ఉదయానికల్లా తుపానుగా, ఆ తర్వాత తీవ్ర తుపానుగా మారుతుంది. ఆదివారం సాయంత్రానికల్లా పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్ ల మధ్య తీరం దాటే అవకాశం ఉంది.." అని ఆమె వెల్లడించారు.

**సముద్రంలోకి వెళ్లొద్దంటూ హెచ్చరికలు**

అల్పపీడనం తుపానుగా మారాక గంటకు 102 కిలోమీటర్ల వరకు వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. మే 27వ తేదీ వరకు ఒడిశా, పశ్చిమ బెంగాల్, ఈశాన్య రాష్ట్రాల వారు చేపల వేట, ఇతర ఏ పనులపైనా సముద్రంలోకి వెళ్లవద్దని స్పష్టం చేసింది. ఇప్పటికే సముద్రంలోకి వెళ్లిన మత్స్యకారులు వెంటనే తీరానికి చేరుకోవాలని సూచించింది.

**పశ్చిమబెంగాల్, ఒడిశాల్లో భారీ వర్షాలు**

ఈ తుపాను ప్రభావంతో ఉత్తర ఒడిశా, పశ్చిమబెంగాల్, మిజోరం, త్రిపుర, మణిపూర్ రాష్ట్రాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. అయితే మిగతా తీర ప్రాంత రాష్ట్రాలపై ప్రభావం తక్కువగానే ఉంటుందని పేర్కొంది.

**కచ్చితంగా తీవ్ర తుపాను అని చెప్పేదెలా..?**

బంగాళాఖాతంలోని ప్రస్తుత అల్పపీడనం కచ్చితంగా తీవ్ర తుపానుగా ఎందుకు మారుతుందన్న దానిపై ఐఎండీ సీనియర్ శాస్త్రవేత్త డీఎస్ పాయ్, కేంద్ర భూవైజ్ఞానిక శాఖ మాజీ కార్యదర్శి మాధవన్ రాజీవన్ పలు వివరాలు వెల్లడించారు. సాధారణంగా అల్పపీడనం ఏర్పడినప్పుడు సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు 27 డిగ్రీలు, అంతకన్నా ఎక్కువగా ఉంటే అది తుపానుగా మారుతుంది. ప్రస్తుతం బంగాళాఖాతంలో నీటి ఉపరితల ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయి. అంటే అల్పపీడనం అత్యంత సులువుగా, కచ్చితంగా తీవ్ర తుపానుగా మారుతుంది.

# నా సహనాన్ని పరీక్షించకు.. లొంగిపో..

## ప్రజ్వల్ రేవణ్ణకు దేవెగౌడ మాస్ వార్నింగ్

**బెంగళూరు :** రాసలీల వీడియోల్లో అడ్డంగా దొరికిపోయిన తన మనవడు, హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ వెంటనే భారత్ తిరిగి వచ్చి.. పోలీసులకు లొంగిపోవాలని అతడి తాత, మాజీ ప్రధాని దేవగౌడ సూచించారు. లేకుంటే తన ఆగ్రహాన్ని చవి చూడాల్సి ఉంటుందని ప్రజ్వల్‌ను ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. మై వార్నింగ్ టు ప్రజ్వల్ రేవణ్ణ పేరుతో గురువారం ఎక్స్ వేదికగా తాను రాసిన లేఖను దేవగౌడ పోస్ట్ చేశారు. నీవు నా సహనాన్ని పరీక్షించవద్దు. ఎక్కడ ఉన్నా తిరిగి రావాలి. న్యాయ ప్రక్రియను ఎదుర్కోవలసి ఉందని ప్రజ్వల్‌కు ఈ సందర్భంగా దేవగౌడ సూచించారు. అయితే ఈ లేఖ ద్వారా ప్రజ్వల్‌ను తాను అభ్యర్థించడం లేదని.. హెచ్చరిస్తున్నానని దేవగౌడ స్పష్టం చేశారు. ఈ విషయంలో తనతోపాటు తన కుటుంబ సభ్యుల ఆగ్రహాన్ని సైతం ప్రజ్వల్ ఎదుర్కోవలసి ఉంటుందన్నారు. తనపై అతడికి ఏ మాత్రం గౌరవం ఉన్నా వెంటనే తిరిగి రావాలని ఆకాంక్షించారు. గత కొన్ని వారాలుగా తన పట్ల, తన కుటుంబ సభ్యుల పట్ల



ప్రజలు చాలా ఆగ్రహంతో తీవ్ర ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. కానీ వారిని ఆ ఆరోపణలు చేయవద్దని వారించనని చెప్పారు. అలాగే వారితో వాదనలకు దిగే ప్రయత్నం కూడా చేయనని తెలిపారు. కానీ ప్రజ్వల్ వ్యవహారంలో నిజాలు వెలుగులోకి వచ్చే వరకు తాను వేచి చూస్తానని దేవగౌడ అన్నారు. అదే విధంగా ప్రజ్వల్ చేసిన పనులు తనకు తెలియదంటూ ప్రజలను బుజ్జగించే ప్రయత్నం సైతం తాను చేయనని స్పష్టం చేశారు. ప్రజ్వల్ విదేశీ ప్రయాణం సంగతి కూడా తనకు తెలియదని ఈ సందర్భంగా దేవగౌడ తెలిపారు. కానీ తన మనసాక్షికి జవాబు చెప్పుకోవాల్సి ఉందన్నారు. ఆ దేవుడినే నమ్ముతానని.. వాస్తవమేమిటన్నది ఆ దేవుడికే తెలియాలని దేవగౌడ చెప్పారు. సార్వత్రిక ఎన్నికల వేళ.. జేడీ(ఎస్) ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ రాసలీల వీడియోలు వేలాదిగా బహిర్గతమయ్యాయి. అయితే అవి బహిర్గమైన వెంటనే.. ప్రజ్వల్ జర్మనీ వెళ్లిపోయారు. దీంతో ఎన్నికల వేళ.. ప్రజ్వల్ వ్యవహారం ప్రతిపక్షాలకు అస్త్రంగా మారాయి. ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, జేడీఎస్ కలిసి కర్ణాటకలో పోటీ చేస్తున్నాయి. ఆ క్రమంలో ఆ రెండు పార్టీలను లక్ష్యంగా చేసుకుని ఇండియా కూటమిలోని పార్టీలు విమర్శనాస్త్రాలు సంధించాయి. ఇక ప్రజ్వల్ రేవణ్ణను భారత్‌కు తీసుకు వచ్చేందుకు కేంద్రం తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది.

# బీజేపీ షోకాజ్ నోటీసు.. స్పందించిన జయంత్ సిన్హా

ఈ సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ తరఫున ప్రచారం చేయకపోవడం, ఓటు హక్కు వినియోగించకపోవడంపై వివరణ ఇవ్వాలంటూ బీజేపీ షోకాజ్ నోటీసు జారీ చేయడంపై ఆ పార్టీ లోక్‌సభ సభ్యుడు జయంత్ సిన్హా స్పందించారు. బీజేపీ తనకు షోకాజ్ నోటీసు జారీ చేయడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తాను వ్యక్తిగత కారణాల వల్ల విదేశాల్లో ఉండవలసి వచ్చిందన్నారు. ఆ క్రమంలో తన ఓటు హక్కు పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకున్నట్లు తెలిపారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడం లేదని తన నిర్ణయాన్ని ఈ ఏడాది మార్చిలోనే ప్రకటించానని చెప్పారు. ఈ ప్రకటన అనంతరం జార?ండ్ బీజేపీలోని ఓ సీనియర్ నాయకుడు కానీ, ఎంపీ, ఎమ్మెల్యే కానీ వచ్చి తనను సంప్రదించలేదన్నారు. బీజేపీ ఓ వేళ తనను కావాలనుకుంటే.. ఎవరో ఒకరు తనను సంప్రదించే వారని జయంత్ సిన్హా అభిప్రాయపడ్డారు. కానీ అలాంటిది ఏమి జరగలేదని ఆయన స్పష్టం చేశారు. అయితే ఎన్నికల కార్యక్రమాల్లో తాను పాల్గొనాలనుకుంటే బీజేపీ కచ్చితంగా తనను సంప్రదించేదన్నారు. కానీ అలాంటిదేమీ జరగలేదని చెప్పారు. ఇక పార్టీ కార్యక్రమాల్లో.. ర్యాలీల్లో.. బహిరంగ



సభల్లో పాల్గొనాలంటూ తనను ఎవరు ఆహ్వానించలేదని జయంత్ సిన్హా ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. మరోవైపు హజారీబాగ్ లోక్‌సభ అభ్యర్థిగా మనీష్ జైశ్వాల్ పేరును బీజేపీ ప్రకటించిందని చెప్పారు. అనంతరం జైశ్వాల్‌కు తాను కాంగ్రాట్స్ కూడా చెప్పానన్నారు. అలాగే సోషల్ మీడియా ద్వారా ఆయనకు మద్దతు సైతం ఇస్తున్నట్లు ప్రకటించానని గుర్తు చేసుకున్నారు.

ఇక మే 1వ తేదీన తన నామినేషన్ పత్రాలు దాఖలు చేయనున్నానని.. అందుకోసం నిర్వహించే ర్యాలీలో పాల్గొనాలంటూ ఏప్రిల్ 29న తనకు జైశ్వాల్ ఫోన్ చేసి ఆహ్వానించారన్నారు. కానీ ఆ విషయం తనకు చాలా ఆలస్యంగా గుర్తుకు వచ్చిందని జయంత్ సిన్హా చెప్పారు. దాంతో మే 2వ తేదీన తాను హజారీబాగ్‌లోని జైశ్వాల్ నివాసానికి వెళ్లానని... కానీ ఆ సమయంలో ఆయన ఇంట్లో లేరన్నారు. దీంతో ఆయనకు తన మద్దతు ఉంటుందని జైశ్వాల్ కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చి వచ్చానన్నారు.

అయితే మే 10వ తేదీన తన వ్యక్తిగత కారణాలతో విదేశాలకు వెళ్లవలసి వచ్చిందని జయంత్ సిన్హా వివరించారు. అదీకాక పార్టీ కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలని తనను ఎవరు కోరలేదన్నారు. దీంతో ఎన్నికల వేళ.. తాను ఇక్కడ ఉండేందుకు కారణం కూడా కనిపించలేదని అబిప్రాయపడ్డారు. జార?ండ్ బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిత్య సాహుకు రాసిన లేఖలో జయంత్ సిన్హా.. తనపై వచ్చిన ఆరోపణలపై వివరణ ఇచ్చారు. గత ఎన్నికల్లో హజారీబాగ్ లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా జయంత్ సిన్హా విజయం సాధించిన సంగతి తెలిసిందే.

## ముంబయిలో ఓ కెమికల్ ఫ్యాక్టరీలో పేలుడు...



ముంబయిలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. థానే జిల్లా డోంబివిలీ ప్రాంతంలోని ఆంబర్ కెమికల్ ఫ్యాక్టరీలో బాయిలర్ పేలడంతో నలుగురు మృతి చెందారు. 30 మందికి పైగా గాయపడ్డారు. బాయిలర్ పేలుడుతో ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. ప్రస్తుతం ఘటన స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. కెమికల్ ఫ్యాక్టరీలో ఈ మధ్యాహ్నం 1.15 గంటలకు పేలుడు జరిగిందని అగ్నిమాపక సిబ్బంది వెల్లడించారు. ఇప్పటివరకు ఆరుగురి మృతదేహాలను వెలికితీసినట్టు తెలిపారు. కాగా, పేలుడు శబ్దం కిలోమీటరు వరకు వినిపించినట్టు స్థానికులు పేర్కొన్నారు. పొరుగునే ఉన్న భవనాల కిటికీ అద్దాలు సైతం పేలుడు ధాటికి పగుల్లిచ్చాయని వివరించారు. కొన్ని నివాస గృహాలు దెబ్బతిన్నట్టు తెలుస్తోంది. ఆ మంటలు చుట్టుపక్కల ప్రాంతాలకు వ్యాపించినట్టు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే ఫ్యాక్టరీలో ఉన్న 30 మందిని రక్షించారు. మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు నాలుగు గంటల సమయం పట్టొచ్చని అగ్నిమాపక సిబ్బంది చెబుతున్నారు. ప్రమాదంలో ఎవరూ చనిపోలేదు. కొందరు గాయ పడ్డారని అధికారులు వివరించారు.

## బెంగళూరు రేవ్ పార్టీ...

## డ్రగ్ టెస్ట్‌లో పాజిటివ్ వచ్చిన వారికి నోటీసులు



బెంగళూరు రేవ్ పార్టీ కేసులో పలువురి రక్తనమూనాల్లో డ్రగ్స్ ఆనవాళ్లను గుర్తించారు. అందులో తెలుగు నటి కూడా ఉన్నట్లు గుర్తించారు. డ్రగ్ టెస్టులో పాజిటివ్ వచ్చిన వారికి సీసీబీ నోటీసులు పంపించింది. ఈ కేసులో ఏ1గా వాసు, ఏ2గా అరుణ్, ఏ3గా నాగబాబు, ఏ4గా రణధీర్ బాబు, ఏ5గా మహమ్మద్ అబూబాకర్, ఏ6గా గోపాల్ రెడ్డి, ఏ7గా 68 మంది పురుషుల పేర్లు, ఏ8గా 30 మంది యువతుల పేర్లను పేర్కొంది. ఈ కేసుకు సంబంధించి 14 గ్రాముల ఎండీఎం, 5 గ్రాముల కొకైన్, భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కోటిన్నర రూపాయల విలువ చేసే డీజే పరికరాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఏ1 నిందితుడు వాసు సన్ సెట్ టు సన్ రైజ్ పేరుతో బర్త్ డే వేడుకలను నిర్వహించినట్లు చెప్పారు. ఈ రేవ్ పార్టీలో మొత్తం 103 మంది పాల్గొన్నారని... ఇందులో 86 మంది డ్రగ్స్ తీసుకున్నారని పోలీసులు వెల్లడించారు. మరోవైపు, రిపోర్టులో పాజిటివ్ వచ్చిన వారికి సీసీబీ నోటీసులు పంపించింది. ఇప్పటికే పలువురిని విచారిస్తున్నారు. నటి హేమతో పాటు ఆషిరాయ్‌కి కూడా పాజిటివ్ వచ్చినట్లు మీడియాలో కథనాలు వస్తున్నాయి. హేమ కృష్ణవేణి పేరుతో ఈ రేవ్ పార్టీకి హాజరైనట్లుగా పోలీసులు గుర్తించారు. పోలీస్ రికార్డుల్లోనూ అదే పేరు ఉందని తెలుస్తోంది.

## ఈసీ హెచ్చరికలనూ ఖాతరు చేయని రాహుల్ గాంధీ : రాజీవ్ చంద్రశేఖర్




లోక్‌సభ ఎన్నికలు క్లైమాక్స్‌కు చేరుకున్న దశలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీలో అసహనం పెరిగిపోతోందని కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో పరిధులు దాటి రాహుల్ వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మతం, కులం, వర్గం ఆధారంగా ప్రజలను విభజించేందుకు రాహుల్ గాంధీ ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఈ క్రమంలో సైన్యాన్ని, సాయుధ బలగాలనూ తన విభజన రాజకీయాల్లో వాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సాయుధ బలగాల నైతిక స్థైర్యం దెబ్బతినేలా ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దని ఈసీ ఇటీవల పార్టీలను హెచ్చరించినా రాహుల్ వినిపించుకోలేదని దుయ్యబట్టారు. రాజ్యాంగ వ్యవస్థల పట్ల రాహుల్‌కు ఎలాంటి గౌరవం లేదని వ్యాఖ్యానించారు. జూన్ 4న రాహుల్‌కు దేశ ప్రజలు స్పష్టమైన సమాధానం ఇవ్వనున్నారని ఆయన పేర్కొన్నారు.

## మైనర్లకు మద్యం సరఫరా చేస్తుంటే చోద్యం చూస్తున్న మహా సర్కార్ : సుప్రియా సూలే



పుణేలో మద్యం మత్తులో మైనర్ విలాసవంతమైన పోర్షే కారును నిర్లక్ష్యంగా నడిపిన ఘటనలో ఇద్దరు ఐటీ ఉద్యోగులు మరణించిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనపై ఎన్సీపీ-ఎస్సీపీ ఎంపీ సుప్రియా సూలే స్పందించారు. మైనర్‌కు మద్యం సరఫరా చేయడంతో పుణేలో డ్రంకెన్ డ్రైవ్ కారణంగా ఘోర ప్రమాదం వాటిల్లిందని అన్నారు. డ్రగ్స్ స్వాధీనం, మైనర్లకు మద్యం సరఫరాలు, డ్రంకెన్ డ్రైవ్ జరుగుతుంటే మహారాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోందని ఆమె మండిపడ్డారు. మహారాష్ట్ర ప్రభుత్వం రాజకీయ పార్టీలను, కుటుంబాలను చీల్చడంలో నిమగ్నమైందని విమర్శించారు. పుణే ఘటనకు బాధ్యులు ఎవరని ఏక్‌నాథ్ షిండే సర్కార్‌ను ఆమె ప్రశ్నించారు.

## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్



ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్‌లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు చనిపోయారు. 12 మంది మావోయిస్టులకు గాయాలయ్యాయి. కాగా, భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య కాల్పులు ఇంకా కొనసాగుతున్నాయి. దంతెవాడ, బీజాపూర్, నారాయణపూర్‌లో మావోయిస్టుల కోసం సెర్చ్ ఆపరేషన్ జరుగుతుంది. అబుజ్‌మద్‌లోని రెక్వాయా అడవుల్లో ఉదయం నుంచి ఎదురు కాల్పులు జరుగుతున్నాయి. ఓర్చా పోలీస్ స్టేషన్ నుంచి ఇంద్రావతికి 25 కిలోమీటర్ల దూరంలోని నేషనల్ పార్క్‌లో ఈ ఎన్‌కౌంటర్ జరుగుతుంది. తొలిసారిగా మూడు జిల్లాల నుంచి 800 మంది భద్రతా దళాలు మేజర్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. కాగా, ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న జవాన్లంతా సురక్షితంగా ఉన్నట్లు ఏఎస్పీ రాబిసన్ గుడియా తెలిపారు. మావోయిస్టుల కోసం ఇంకా సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని.. మావోయిస్టుల్లో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, పారిపోయే ప్రయత్నంలో ఉన్న పలువురు మావోయిస్టులను భద్రతా బలగాలు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.

## ఆధారాలు లేకుండా మాట్లాడటంలో రాహుల్ గాంధీ ఆరితేరారు : నిర్మలా సీతారామన్



బీజేపీ క్రోనీ క్యాపిటలిజంలో మునిగితేలుతోందని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. ఓటర్లను ఆకట్టుకునేందుకు రాహుల్ గాంధీ తీవ్ర వామపక్ష వాదాన్ని అందిపుచ్చుకున్నారని అన్నారు. ఇది రెచ్చగొట్టేలా కనిపిస్తుంది..వెంటనే ఆవేశం పెంచుతుంది..రాజకీయ ప్రచారానికి ఆకట్టుకునేలా ఉంటుందని కానీ క్రోనీ క్యాపిటలిజం గురించి ఎవరు మాట్లాడుతున్నారనేది ముఖ్యమని నిర్మలా సీతారామన్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఈ పదాన్ని వాడటం విడ్డూరమని ఆమె పేర్కొన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీల హయాంలో క్రోనీ క్యాపిటలిజం ఉందని అన్నారు. ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ ప్రభుత్వాలకు ఇది హాల్‌మార్క్ అని అన్నారు. ఆధారాలు లేకుండా మాట్లాడటంలో రాహుల్ గాంధీ నిపుణులని ఎద్దేవా చేశారు. బీజేపీ నేతృత్వంలో కేంద్రంలో వరుసగా మూడోసారి ఎన్డీయే ప్రభుత్వం కొలువుతీరుతుందని నిర్మలా సీతారామన్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఓ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె పలు అంశాలపై ముచ్చటించారు. గత పదేండ్లుగా ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన అభివృద్ధి పనులు, కార్యక్రమాలను చూసిన అనంతరం దేశ ప్రజలు మరోసారి ఆయనకు పట్టం కట్టాలని నిర్ణయించుకున్నారని చెప్పారు.

# పంచాయతీ పోరుపై కొత్త చిచ్చు

-మొదటి పేజి తరువాయి

వ్యక్తమవుతున్నాయి. వచ్చే నెలలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తుంది. ఇప్పటికే సర్పంచ్?ల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల కనుసన్నలలో గ్రామ పంచాయతీల పాలన సాగుతుంది. అయితే ఎక్కువ కాలం ప్రత్యేక అధికారుల పాలనలో ఉంచకుండా సకాలంలో పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తుంది. కానీ రిజర్వేషన్ల అంశం ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్ద సవాల్‌గా మారింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. అందుకు అనుగుణంగా కుల గణన చేసేందుకు అసెంబ్లీ తీర్మానం చేసింది. కానీ లోక్ సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈ కుల గణన ఇంకా ప్రారంభం కాలేదు. దీంతో బీసీల జనాభా లెక్క తేలేందుకు మరింత సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి.

అప్పటిలోపు పంచాయతీ ఎన్నికలను ఆపే పరిస్థితి ఉండదు. బిఆర్ఎస్ హయాంలో ఉన్న రిజర్వేషన్ల ప్రకారమే పంచాయతీ ఎన్నికలను నిర్వహించాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఉండేవి. అయితే రిజర్వేషన్లు 50 శాతానికి మించ కూడదని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో బీసీల రిజర్వేషన్లను 34 శాతం నుంచి 23 శాతానికి కుదిస్తూ కేసీఆర్ ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు నిర్వహించింది. దీన్ని సవాలు చేస్తూ కొందరు హైకోర్టును ఆశ్రయిస్తే.. వచ్చే పంచాయతీ ఎన్నికల్లోపు బీసీ రిజర్వేషన్ల లెక్క తేల్చాలని సూచించింది. దానికి అనుగుణంగా బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. అదే సమయంలో బిసి కుల గణన పూర్తి చేసిన తర్వాతే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంఘాలు కాంగ్రెస్లోని బీసీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. అసెంబ్లీ పార్లమెంటు ఎన్నికల్లో బీసీలకు సరైన ప్రాతినిధ్యం కల్పించలేదని అందుకే పాత పద్ధతుల్లోనే రిజర్వేషన్లు అమలు చేస్తే పంచాయతీ ఎన్నికల్లో కూడా బీసీలకు అన్యాయం జరుగుతోందని చెబుతున్నారు. అందుకే ఐదేళ్లకు ఒకసారి వచ్చే పంచాయతీ ఎన్నికలను కొంతకాలం వాయిదా వేసి.. బీసీ జనాభా లెక్కలు తేలిన తర్వాత జనాభా ప్రాతిపదికన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు పంచాయతీలో బీసీలకు ఇవ్వాల్సిందేనని పట్టుబడుతున్నారు. అయితే పంచాయతీ ఎన్నికలను ఆలస్యం చేస్తే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోంది 73వ రాజ్యాంగ సవరణ చట్టం ప్రకారం ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి పంచాయతీ ఎన్నికలను విధిగా నిర్వహించాలి సాంకేతిక లేక రాజకీయపరమైన కారణాలతో పంచాయతీ ఎన్నికలను వాయిదా వేస్తే కేంద్ర నుంచి పంచాయతీలకు రావాల్సిన నిధులు నిలిచిపోతాయి. అప్పుడు పంచాయతీల అభివృద్ధి కుంటుపడుతుంది. దీనివల్ల ప్రభుత్వం అపకీర్తిని మూటకట్టుకోవాల్సి వస్తోంది. అయితే సకాలంలో ఎన్నికలు నిర్వహిద్దామంటే ఈ బీసీల రిజర్వేషన్ అంశము కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇబ్బందులు పెడుతుంది. బీసీల కులగనన త్వరగా తేల్చే అంశం కాదు. 52 శాతానికి మించి రాష్ట్రంలో బీసీ జనాభా ఉంది. దీంతో బీసీల లెక్క తెలడానికి ఎక్కువ సమయం బట్టే అవకాశాలు ఉన్నాయి. అలాగని పంచాయతీ ఎన్నికలు నిర్వహిద్దామంటే బీసీలు అంగీకరించే పరిస్థితి లేదు. పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తే ఒక బాధ.. నిర్వహించకపోతే మరొక బాధ అన్నట్లు కాంగ్రెస్ పార్టీ పరిస్థితి మారింది. దీంతో పంచాయతీ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి ప్రభుత్వానికి ముందు నుయ్యి వెనక కొయ్యి అన్నట్లు మారింది. అయితే ఈ అంశాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా అధిగమిస్తోంది అన్నది ఆసక్తికరంగా మారింది. గత ప్రభుత్వం మాదిరిగా బీసీల ఒత్తిళ్లకు తలొగ్గకుండా సకాలంలో కాంగ్రెస్ ఎన్నికల నిర్వహిస్తుందా లేక బీసీ కులగన తర్వాతే పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు చేపడుతుందా వేచి చూడాలి.

# టీజీ సిరీస్‌కు మంచి గిరాకీ..

-మొదటి పేజి తరువాయి

విక్రయించబడింది. “టీజీ 09 9999” నంబర్ ప్లేట్‌ను సోనీ ట్రాన్స్‌పోర్ట్ సొల్యూషన్స్ అనే సంస్థ రూ. 25,50,002 భారీ ధరను వెచ్చించి కొనుగోలు చేసింది. కంపెనీ యాజమాన్యంలోని టయోటా ల్యాండ్ క్రూయిజర్ వాహనం కోసం ఈ నంబర్ ప్లేట్ ఉపయోగించనున్నారు.

కొత్త శ్రేణి నంబర్‌లను వేలం వేసిన ఒక్క రోజులో రవాణా శాఖ ద్వారా మొత్తం రూ.43,70,284 ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. మార్చి నుంచి నగరంలో ఫ్యాన్సీ టీజీ నంబర్ ప్లేట్ల వేలం ప్రారంభం కావడంతో ఇప్పటి వరకు ఆర్టీఏ శాఖకు కేవలం ఇలాంటి ఫ్యాన్సీ రిజిస్ట్రేషన్ల వల్ల రూ.30 లక్షలు ఆదాయం వచ్చిపడింది. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల టీఎస్ నుండి టీజీ గా మార్చాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం తరువాత, తెలంగాణ పాత వాహనాల నంబర్ ప్లేట్‌లకు అప్‌డేట్ అవసరమా అనే దానిపై చాలా మంది ఆసక్తిగా ఉన్నారు. కొత్త వాహనం రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న వాహన యజమానులు టీజీ నంబర్ ప్లేట్‌ను పొందుతున్నారు. అయితే ఇప్పటికే రిజిస్టర్ అయిన వాహనాల నంబర్ ప్లేట్లను మార్చాల్సిన పనిలేదని స్పష్టం చేసింది రవాణా శాఖ. మొట్ట మొదటి టీజీ సీరీస్లోని నంబర్ ప్లేట్, టీజీ 09 0001 వేలం వేయగా రూ. 9.61 లక్షలకు కొనుగోలు




చేసినట్లు రవాణా శాఖ తెలిపింది.

ఫ్యాన్సీ నంబర్స్ కావాలని ఎవరైనా ఆసక్తి చూపితే రూ.50,000 చెల్లించి దానిని రిజర్వ్ చేసుకోవచ్చని, ఒక వేళ ఒకటి కంటే ఎక్కువ మంది బిడ్డర్లు ఉంటే బిడ్డింగ్ జరుగుతుందని అధికారులు తెలిపారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది మార్చిలో వాహనాల రిజిస్ట్రేషన్ కోడ్‌ను టీఎస్ నుంచి టీజీగా మార్చిన సంగతి తెలిసిందే. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వాహన రిజిస్ట్రేషన్ మార్క్‌లో మార్పు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఈ మేరకు కేబినెట్‌లో తీర్మానం చేసి కేంద్రానికి పంపారు. దీంతో కేంద్రం తెలంగాణ వాహన రిజిస్ట్రేషన్ సిరీస్‌ను టీఎస్ నుంచి టీజీకి మార్పు చేస్తూ మార్చి 12న కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. మోటారు వాహనాల చట్టం 1988లోని సెక్షన్ 41(6) కింద ఉన్న అధికారాలతో గెజిట్ నోటిఫికేషన్‌లో మార్పు చేసినట్లు కేంద్ర రవాణా శాఖ తెలిపింది. నోటిఫికేషన్‌లోని టేబుల్‌లో సీరియల్ నంబర్ 29ఏ కింద.. తెలంగాణ రాష్ట్రానికి ఇదివరకు ఉన్న టీఎస్ స్థానంలో ఇప్పుడు టీజీ మార్క్ కేటాయించినట్లు వెల్లడించింది. తెలంగాణలో ఇకపై రిజిస్టర్ అయ్యే వాహనాలకు టీఎస్‌కు బదులు టీజీ రానుంది. ఇది కొత్తగా రిజిస్ట్రేషన్ చేసే వాహనాలకు మాత్రమే వర్తిస్తుంది. పాత వాటికి యథావిధిగా టీఎస్ కొనసాగుతుందని, కొత్తగా మార్చుకోవాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు.

# హైదరబాద్‌కు తప్పనున్న నీటిగండం

-మొదటి పేజి తరువాయి

ఈ భగీరథ ప్రయత్నం సక్సెస్ అయితే అబ్దుల్ కలాం సుజల స్రవంతి పథకంలో భాగమైన బ్రహ్మణపల్లి పంప్ హౌజ్ నుండి రాష్ట్ర రాజధానికి వర్షకాలం వరకు నీటి సరపరా కు డోకా లేనట్లే అంటున్నారు అధికారులు.

ఎల్లంపల్లి ఎన్నడూ లేనంతగా అడుగంటి పోయి ఎడారిలా మారి తల్లడిల్లుతోంది. మండుతున్న ఎండలతో అడుగంటుతున్న ఎల్లంపల్లి 2016లో ఏర్పడిన తాగినీటి కష్టాలను పునారావృతం చేసేలా కనిపిస్తోంది. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 148 అడుగులకు గాను 140.5 అడుగుల నీటి మట్టం మాత్రమే ఉండటం.. 20 టీఎంసీలకు గాను 5.5 టీఎంసీల నీరు మాత్రమే జలాశయంలో నిల్వ ఉండటంతో డెడ్ స్టోరేజీకి సమీపంలోకి వచ్చి చేరింది. భానుడి భగభగలతో రోజుకు 160 క్యూసెక్కుల నీరు ఆవిరవుతుండగా.. 331 క్యూసెక్కుల నీరు హైదరబాద్ కు తాగునీటి అవసరాల కోసం ఎన్టీపీసీకి 121 క్యూసెక్కుల నీరు బ్రహ్మణపల్లి పంప్ హౌజ్ నుండి సరపరా అవుతోంది.

అయితే బ్రహ్మణపల్లి పంప్ హౌజ్‌కు నీళ్లు చేర్చే ఇన్ టెక్ కాల్వకు సమీపంలో ఎల్లంపల్లి జలాశయ మట్టం 138.5 అడుగులకు పడిపోవడంతో పంప్ హౌజ్ కు నీరు చేరడం గగనమైంది. దీంతో అలర్ట్ అయిన హెచ్ఎండబ్ల్యుఎస్ అధికారులు ఎల్లంపల్లి జలాశయంలో వార్ జోన్ ను ఏర్పాటు చేసి, 120 హెచ్ పీ సామర్థ్యం ఉన్న 20 మోటర్ల ను యుద్ధ ప్రాతిపదికన బిగించి తాగునీటి కష్టాలకు చెక్ పెట్టే ప్రయత్నం మొదలు పెట్టారు.

ఉదయం ఎర్రని ఎండలు.. సాయంత్రం ఒక్కసారిగా చల్లగా మారి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురుస్తున్నా..



భగీరథ ప్రయత్నాన్ని మాత్రం ఆపడం లేదు సిబ్బంది. అబ్దుల్ కలాం సుజల స్రవంతి పథకం ద్వారా హైదరబాద్ మెట్రోపాలిటిన్ సిటీకి నీరందించే ప్రయత్నం చేస్తున్నారు బ్రహ్మణపల్లి పంప్ హౌజ్ అధికారులు. పంప్ హౌజ్ ఇంఛార్జ్ సతీష్ ఆద్వర్యంలో జలాశయంలో ఎత్తిపోతల ద్వారా నీటిని కాల్వలోకి తరలించదుకు మోటర్లను బిగించే భగీరథ యత్నం చకాచకా సాగుతోంది. 25 సబ్మెర్సిబుల్ పంపులను నదిలో ఏర్పాటుచేసి అప్రోచ్ కాలువలోకి ఎత్తిపోయనున్నారు. జులై చివరి వారం నాటికి ఈ ప్రాజెక్టుకు ఇన్ఫో ప్రారంభమవుతుంది. అప్పటి వరకు అప్రోచ్ కాలువలోకి నీటి ఎత్తిపోత తప్పనిసరని బ్రహ్మణపల్లి పంప్ హౌజ్ అధికారులు చెప్తున్నారు.

2016 లో ఇదే పరిస్థితి ఎదురవడంతో ఆ ఏడాది 16 మోటర్లను నదిలో బిగించి ఇన్ టెక్ కాల్వలోకి ఎల్లంపల్లి జలాలను ఎత్తిపోశారు. ఈ ఏడాది హైదరబాద్ తోపాటు మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల మిషన్ భగీరథకు, ఎన్టీపీసీకి అత్యవసర మంచి నీటి సరపరా కోసం 120 హెచ్ పీ సామర్థ్యం ఉన్న మరో నాలుగు అత్యాధునిక సబ్మెర్సిబుల్ పంపులను నదిలో ఏర్పాటుచేసి ఇన్ టెక్ కాల్వలన నింపే ప్రయత్నం చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు . ప్రస్తుతం ఎల్లంపల్లి ఇన్‌టెక్ వెల్ వద్ద 138 మీటర్ల మట్టం వద్ద నీళ్లు ఉండగా భగీరథ ప్రయత్నంతో అప్రోచ్ కాలువల లోతును పెంచి ఇన్ టెక్ వెల్ లోకి నీరు వచ్చేలా భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. దీని ద్వారా మంచిర్యాల జిల్లాలోని తొమ్మిది మండలాలకు తాగు నీరందించే మిషన్ భగీరథ ఇన్ టెక్ వెల్ లను 140 మీటర్ల మట్టం ఉండేలా జాగ్రత్త పడుతున్నారు. అందుకోసం జేసీబీల సాయంతో కాల్వలలను తవ్వించి గోదావరిలోని నీటిని పంప్ హౌజ్ లోకి మళ్లించే భగీరథ యత్నం చేస్తున్నారు ఎల్లంపల్లి అదికారులు. ఈ భగీరథ ప్రయత్నం సక్సెస్ అయితే వర్షకాలం ప్రారంభం వరకు ఇటు మంచిర్యాల జిల్లాకు తాగు నీటి గండం తప్పినట్టే.. అటు బ్రహ్మణపల్లి పంప్ హౌజ్ వద్ద సబ్ మెర్సిబుల్ పంపుల బిగింపు పూర్తయితే.. 140 అడుగులున్న గోదావరి నది గర్బం నుంటి పంప్ హౌజ్ అప్రోచ్ కాల్వలోకి నీరు ఎత్తిపోయడం షురూ అయితే రాష్ట్ర రాజదాని హైదరబాద్ జులై మొదటి వారం వరకు నిరంతరాయంగా తాగునీటి సరపరా చేసే అవకాశం ఉంటుంది. ఆలోగా అకాల వర్షాలతో ఒక్క టీఎంసీ వాటర్ వరద రూపంలో జలాశయంలోకి వచ్చినా తాగునీటి గండాన్ని ఈ ఏడాది గట్టెక్కినంటే అంటున్నారు ఎల్లంపల్లి అదికారులు.

# అన్ని ఆధారాలు ఉన్నాయి.. నీ చిట్టా మొత్తం విప్పుతా..

మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిపై బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో కొత్తగా యూ ట్యాక్స్ నడుస్తోందని ఇటీవల ఆరోపించిన ఆయన.. దీనిపై ఉత్తమ్ స్పందన కోసం నిన్న పొద్దుపోయే దాకా చూశానని చెప్పారు. తాను చెప్పినవన్నీ వాస్తవాలు కాబట్టే ఉత్తమ్ కుమార్ రెడ్డి మొహం చాటేశారని విమర్శించారు. ఏం చేయాలో తెలియక.. తనపై పోలీసు కేసు పెట్టించారని అన్నారు. రైస్ మిల్లర్ల నుంచి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి క్వింటాలుకు రూ.216 డిమాండ్ చేశారని... ఒక్కొక్క చిట్టా మొత్తం విప్పుతానని... తన వద్ద పూర్తి సమాచారం ఉందని బీజేపీ శాసన సభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. ‘యూ’ ట్యాక్స్ అంటూ మహేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధానికి కారణమయ్యాయి. ఉత్తమ్‌పై యూ ట్యాక్స్ ఆరోపణలు సరికాదని కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు. మంత్రిపై మహేశ్వర్ రెడ్డి అనుచిత ఆరోపణలు చేశారంటూ కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేశారు. దీంతో మహేశ్వర్ రెడ్డిపై కేసు నమోదయింది. ఈ అంశంపై మహేశ్వర్ రెడ్డి గురువారం స్పందించారు. ఉత్తమ్ కుమార్ రెడ్డిపై తాను చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని... అందుకే ఆయన స్పందన కోసం నిన్నంతా ఎదురు చూశానన్నారు. తాను చెప్పింది వాస్తవాలు కాబట్టే ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించకుండా ముఖం చాటేశారన్నారు. ఏం చేయాలో తెలియక తనపై కేసులు పెట్టించారని మండిపడ్డారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. సిట్టింగ్ జడ్జితో కమిటీ వేయాలన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డిపై తాను చేసిన ఆరోపణలకు సంబంధించి ఆధారాల సహా నిరూపించేందుకు సిద్ధమని వ్యాఖ్యానించారు. పౌరసరఫరాలో ఉన్న అవకతవకలను ఏ విధంగా సరిచేస్తారో చెప్పాలని నిలదీశారు. పోలీసు కేసులతో ఏదీ పరిష్కారం కాదని హితవు పలికారు. ధాన్యం సేకరణకు సంబంధించి 25-01-24న ఇచ్చిన జీవోలో టెండర్ ప్రాసెసింగ్ చేయాలని చెప్పారని... అదేరోజు గ్లోబల్ టెండర్ పిలిచారన్నారు.

## అంగట్లో అమ్మకానికి ఆడ బిడ్డ..!

-మొదటి పేజి తరువాయి



ఆడ శిశువుని అమ్మకానికి పెట్టారు. ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఓ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు స్టింగ్ ఆపరేషన్ నిర్వహించి వెలుగులోకి తెచ్చారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రామకృష్ణనగర్‌లో ఉన్న శోభారాణి ఫస్ట్ ఎయిడ్ సెంటర్ వేదికగా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆర్ఎంపీ వైద్యురాలు శోభారాణిని 60 రోజుల ఆడ శిశువును రూ. 4.50 లక్షలకు ఇప్పిస్తానని ఒప్పందం చేసుకుంది. అందులో భాగంగా ముందుగా రూ. 10 వేలు అడ్వాన్స్‌గా తీసుకుంది.

ముందుగా ఒప్పందం చేసుకున్న ప్రకారం పాప కోసం ఏన్జీవో సభ్యులు క్లినిక్‌కు వచ్చారు. ఓ మహిళ అక్కడకు వచ్చి ఓ పాపను అప్పగించింది. ఏన్జీవో ప్రతినిధులు ఈ వ్యవహారంపై పోలీసులకు సమాచారం అందించారు. ఫౌండేషన్ ప్రతినిధులు ఇచ్చిన సమాచారంపై రంగంలోకి దిగిన పోలీసులు ఆర్ఎంపీ డాక్టర్ శోభారాణి తోపాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. బిడ్డను పోషించడం కష్టంగా ఉందని ఆ పసికందు తల్లి చెప్పడంతో పిల్లలు లేనివారికి అమ్మినట్లుగా దర్యాప్తులో శోభారాణి అంగీకరించింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అనేక కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. పాపను శిశువిహార్‌కి తరలించారు.

## సోనియాకు ఆహ్వానంపై రాజకీయ ప్రకంపనలు..

కాంగ్రెస్ నిర్ణయంపై బీజేపీ ఫైర్..



తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు సోనియా వస్తారా? రారా? అంతకంటే ముందే ఈ అంశం ఇప్పుడు రాజకీయ ప్రకంపనలు రేపుతోంది. సోనియా ఆహ్వానాన్ని బీజేపీ నేతలు తప్పుబడుతున్నారు. తెలంగాణ దేవత అయిన సోనియాను ఎందుకు ఆహ్వానించకూడదని ప్రశ్నిస్తున్నారు అధికార పార్టీ నేతలు.. జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు సోనియా గాంధీను ఆహ్వానించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మూడు రోజుల క్రితం జరిగిన భేటీలో కేబినెట్ నిర్ణయించింది. ఈ అంశం ఇప్పుడు గల్లీ టు ఢిల్లీ చర్చనీయాంశంగా మారింది. సోనియాను ఆహ్వానించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రతిపక్షాలు తప్పుబడుతున్నాయి. రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలన్న నిర్ణయాన్ని కమలనాథులు తప్పుబడుతూనే, సోనియాను పిలవడం ఏంటని ఆ పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు. అసలు సోనియాను ఏ హెూదాలో ఆహ్వానిస్తారంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో 1500 మందిని బలి తీసుకున్నందుకు సోనియాను ఆహ్వానించి సన్మానిస్తారా అని అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ప్రభుత్వ కార్యక్రమమా? పార్టీ కార్యక్రమమా? అంటున్నారు కిషన్ రెడ్డి. ప్రభుత్వ కార్యక్రమమే అయితే పార్టీ అధినేతను ఎలా ఆహ్వానిస్తారు? పార్టీ కార్యక్రమం అయితే గాంధీ భవన్‌లో ఘనంగా సన్మానించుకోవచ్చు అంటూ సెటైర్లు వేశారు కిషన్ రెడ్డి.. అయితే కమలనాథులను కాంగ్రెస్ నేతలు తప్పుబడుతున్నారు. సోనియా తెలంగాణ ఇచ్చిన దేవత అంటూ ప్రశంసిస్తున్నారు. తెలంగాణ ఏర్పాటునే ప్రధాని మోదీ అవమానించారన్న కాంగ్రెస్ నేతలు.. మోదీ నాయకత్వంలో పనిచేస్తే ఇలానే మాట్లాడుతారని కిషన్ రెడ్డిని ఉద్దేశించి విమర్శిస్తున్నారు. సోనియా రాకను తప్పుబడుతున్నారంటే బీజేపీ మహిళలకు ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నిస్తున్నారు ఆ పార్టీ నేత అద్దంకి దయాకర్.. ఇదంతా ఇలా ఉంటే ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాలు నిర్వహించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సైతం బీజేపీ నేతలు తప్పుబడుతున్నారు. మాజీ సీఎం కేసీఆర్ చివరి ఏడాదే ఉత్సవాలు నిర్వహించారు, మళ్లీ ప్రత్యేకంగా జరపడం ఎందుకు ప్రశ్నించారు ఆ పార్టీ నేత బూర నర్సయ్య గౌడ్. ఫీజు రీఎంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీకి నిధులు లేవు కాని ఉత్సవాలకు ఉన్నాయా అని ప్రశ్నించారు.

## రాయలసీమలో ఫ్యాక్షనిజం బంద్ అయింది...

## కొల్లాపూర్‌లో ప్రారంభమైంది: శ్రీనివాస్ గౌడ్

**కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పాలమూరు జిల్లాలో కాంగ్రెస్ దారుణాలకు పాల్పడుతోందని ఆగ్రహం**

**బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధిపై దృష్టి సారించాం తప్ప దారుణాలకు పాల్పడలేదన్న మాజీ మంత్రి**

**ముఖ్యమంత్రి జిల్లాలో వరుసగా హత్యలు జరుగుతుంటే సమీక్ష జరపాలన్న శ్రీనివాస్ గౌడ్**



రాయలసీమలో ఇప్పుడు ఫ్యాక్షనిజం బంద్ అయిందని... కానీ కొల్లాపూర్‌లో ప్రారంభమైందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని చిన్నంబావి మండలం లక్ష్మీపల్లి గ్రామంలో హత్యకు గురైన పార్టీ నాయకుడు శ్రీధర్ రెడ్డి కుటుంబాన్ని మాజీ మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్ గౌడ్, పార్టీ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గురువారం పరామర్శించారు. అనంతరం శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉమ్మడి పాలమూరు జిల్లాలో దారుణాలకు పాల్పడుతోందన్నారు. చివరకు ప్రాణాలు తీసేవరకు వెళ్లిందన్నారు. ఎన్నికలు పూర్తైనప్పటి నుంచి ఇప్పటి వరకు ముగ్గురు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు రాయలసీమలో కూడా ఇప్పుడు ప్రశాంతంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే వారు జోరుగా ప్రచారం చేస్తున్నారని... కానీ తర్వాత కలిసి ముందుకు సాగుతున్నారన్నారు. కానీ కొల్లాపూర్‌లో మాత్రం కాంగ్రెస్ నేతలు అరాచకానికి పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము పదేళ్లు అధికారంలో ఉన్నప్పటికీ ఇలాంటి దారుణాలకు పాల్పడలేదన్నారు. తాము అభివృద్ధి పైనే దృష్టి సారించామన్నారు. అమాయకులను హత్య చేయించడం దారుణమన్నారు. ఇలాంటి పరిస్థితులు ఉంటే గ్రామాల నుంచి మండలాలకు పాకుతుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి జిల్లాలో వరుస హత్యలు జరుగుతున్నాయంటే సమీక్ష జరపాల్సిన బాధ్యత లేదా? అని నిలదీశారు. శ్రీధర్ రెడ్డి హత్యలో దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. సిట్ లేదా జ్యుడీషియల్ విచారణ జరిపించాలన్నారు.

# ప్రశ్నార్థకంగా ఆలయాల భద్రత

**కరీంనగర్ :** ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రాల్లోని ఆలయాల భద్రత ప్రశ్నార్థకంగా మారుతుంది. భక్తుల్లో అభద్రత భావం ఏర్పడుతుంది. అరకొర భద్రత సిబ్బంది ఉన్నప్పటికి మొక్కుబడి డ్యూటీలు చేస్తు ప్రైవేట్ వ్యక్తులచే భద్రతను పర్యవేక్షించాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. తద్వారా ఆలయాల భద్రత గాలిలో దీపంలా మారుతుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కాళేశ్వరంలో ప్రముఖ ఆలయాలు ఉన్నాయి. దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ రాజన్న క్షేత్రం, కొండగట్టుకు ఎస్పీఎఫ్ భద్రత తూతూ మంత్రంగానే ఉండడం గమనార్హం. వేములవాడకు నిత్యం భక్తుల రద్దీ ఉంటుంది. సాధారణ రోజుల్లో 10 వేలమంది, ఆది, సోమవారాల్లో 25వేలు, ఉత్సవాల సమయం లో సుమారు రెండు లక్షల మంది స్వామివారిని దర్శించుకుంటారు. భక్తుల రద్దీతో ఉండే వేములవాడ రాజన్న ఆలయంలో భద్రత ప్రశ్నార్థకంగా మారింది. రాజన్న దర్శనానికి వచ్చే భక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేయడానికి లక్షలాది రూపాయలు వెచ్చించి మెటల్ డిటెక్టర్లు, హ్యాండ్ డిటెక్టర్లు కొనుగోలు చేశారు. భద్రత కోసం 12 మంది ఎస్ పి ఎఫ్ సిబ్బంది, 36 మంది హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో ప్రోటోకాల్ పేరుతో ఐదుగురిని వాడుకుంటున్నారు. అంతే కాకుండా దేవాలయంలో పనిచేసే కాంట్రాక్టు ఉద్యోగులను సైతం వదలడం లేదు. ఇవన్నీ అలా ఉండగా డ్యూటీ లో వినియోగించాల్సిన ఆయుధాలను సైతం ప్రైవేటు కాంట్రాక్టర్ల దగ్గర పనిచేసే అనామకులకు ఇచ్చేసి చేతులు దులుపుకుంటున్నారు. రాజన్న ఆలయానికి వచ్చే భక్తులను పరిశీలించడానికి సెల్ ఫోన్ కాంట్రాక్టు సిబ్బందికి హ్యాండ్ డిటెక్టర్ ఇచ్చి చెక్ చేయించడం వివాదస్పదంగా మారింది. కొండగట్టుకు సాధారణ రోజుల్లో వేలల్లో, హనుమాన్ జయంతి సమయాల్లో లక్ష లాదిగా తరలివస్తారు. ధర్మపురి, కాళేశ్వరం ఆలయాలకు నిత్యం భక్తుల రద్దీ ఉంటుంది. పుష్కరాల సమయంలో తెలంగాణతోపాటు మహారాష్ట్ర, చత్తీస్గఢ్, కర్ణాటక నుంచి భక్తులు పోటెత్తుతారు. భక్తుల రద్దీ నేపథ్యం లో పోలీసులే భద్రత చర్యలు



చేపడుతున్నారుకొండగట్టులో 15మంది వరకు హోంగార్డులు విధులు నిర్వర్తిస్తున్నారు. గతేడాది ఆలయంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. స్వామివారి అలంకరణ వస్తువులు కాజేసి పారిపోయారు. ఆ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపినా.. ఆలయానికి ఎస్పీఎఫ్ భద్రత ఇవ్వాలన్న ఆలోచన ప్రభుత్వానికి కలగకపో వడం విశేషం. ఇక్కడ కూడా ఒక ఎస్సై, 10 మంది వరకు కానిస్టేబుళ్లను నియమించాలని భక్తులు కోరుతున్నారు. ఎస్పీఎఫ్ బలగాలు ఉంటే పుణ్యక్షే త్రాల్లో దళారుల అవినీతికి ముకుతాడు పడుతుందని, ఎలాంటి వ్యాపారాల్లోనైనా పారదర్శకత పెరుగుతుందని, ఫలితంగా ఆలయాలకు ఆదాయం, భక్తులకు సౌకర్యాలు రెట్టింపు అవుతాయని స్థానిక వ్యాపారులు, భక్తులు అభిప్రాయపడుతున్నారు. 18వ శతాబ్దంలో దక్షిణ భారతంలో కేవలం రెండు ఆలయాలు రోజుకు రూ. 4లక్షల ఆదాయం కలిగి ఉండేవి. అందులో ఒకటి తిరుమల, రెండోది వేములవాడ. ఈ విషయం చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. స్వాతంత్ర్యానికి ముందే ఈ స్థాయిలో ఆదాయం ఉన్న అరుదైన దేవాలయం మన రాజరాజేశ్వర స్వామి ఆలయం. క్రమంగా గుడి ఆదాయం తగ్గిపోయింది. కొందరు పాలకులు ఈ ఆలయానికి వస్తే పదవిపోతుందని తప్పుడు ప్రచారం చేయడం కూడా ఆలయ అభివృద్ధి జరగక పోవడానికి ప్రధాన కారణంగా నిలిచింది. గత ప్రభుత్వం వేములవాడ టెంపుల్ డెవలప్మెంట్ అథారిటీ (వీటీడీఏ)ను ఏర్పాటు చేసి రూ. 70 కోట్లు కేటాయించింది. అందులో రూ. 20 కోట్లు వెనక్కి వెళ్లాయి. ప్రస్తుత ఎమ్మెల్యే చొరవతో అందులో రూ. 20 కోట్లు తిరిగి తీసుకురాగలిగారు. కొండగ ట్టుకు రూ. 500 కోట్లతో మాస్టర్న్ ప్రతిపాదన ప్రకటనకే పరిమితమైంది. 2015లో ధర్మపురి, కాళేశ్వర ఆలయాలకు పుష్కరాల సమయాల్లో అసాధారణ తాకిడి కనిపించింది. ఈసారి అంతకుమించి భక్తులు వస్తారని అంచనా. ధర్మపురి, కాళేశ్వరాలకు కూడా ఎస్పీఎఫ్ భద్రత కల్పిస్తే.. పుష్కరాల సమయంలో స్థానిక పోలీసులతో సమన్వయం, భద్రతా ఏర్పాట్ల విషయంలో మరింత పకడ్బందీగా వ్యవహరించవచ్చని ఉమ్మడి జిల్లా ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# రాజకీయ బోనస్ రగడ

**నిజామాబాద్ :** వరి పంటకు బోనస్ అంశం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. ఇటీవలే మంత్రివర్గ సమావేశం తర్వాత మంత్రులు మీడియాతో మాట్లాడుతూ వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి సన్న వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తామని ప్రకటించారు. దీంతో అసలు రాజకీయ రగడ మొదలైంది. అసెంబ్లీ ఎన్నిక వేళ కాంగ్రెస్ మేనిఫెస్టోలో పంట బోనస్ పై హామీనిచ్చింది. రైతు ఏ రకం వరి పండించినా, ఎన్ని క్వింటాలు పండించినా? క్వింటాకు రూ. 500 బోనస్ ఇస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్న విషయాన్ని ప్రతిపక్ష పార్టీలు గుర్తుచేస్తున్నాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ మాట మార్చి?. కేవలం సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇవ్వడమేంటని ప్రశ్నిస్తున్నాయి. ఇచ్చిన హామీ మేరకు దొడ్డు వడ్లకు కూడా రూ. 500 బోనస్ ఇవ్వాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ బోనస్ అంశపై ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ బలంగా తెరపైకి తీసుకువస్తోంది. మరోవైపు బీజేపీ కూడా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తోంది. అప్పుడు మాట ఇచ్చి? ఇప్పుడు ఇవ్వమని చెప్పడమేంటని నిలదీస్తోంది. సన్న వడ్ల పేరుతో సర్కార్ తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపిస్తోంది. మరోవైపు ప్రతిపక్ష పార్టీల ఆరోపణలపై ప్రభుత్వంలోని మంత్రులు, పెద్దలు గట్టిగా కౌంటర్ ఇస్తున్నారు. మరోవైపు మార్కెట్ లో సన్న వడ్లకు రోజురోజుకూ డిమాండ్ పెరుగుతుంది. దొడ్డు రకాలను తినేందుకు ప్రజలు పెద్దగా ఆసక్తి చూపటం లేదు. దొడ్డు వడ్లను కేవలం తెల్ల రేషన్ కార్డు వినియోగదారుల కోసమే కొనుగోలు చేసి ప్రజలకు సరఫరా చేస్తుంది. అందులోనూ మెజారిటీ శాతం బియ్యం?. అడ్డదారిలో రేషన్ డీలర్లు, మిల్లర్ల వద్దకే చేరుతుందన్న ఆరోపణలు కూడా



ఉన్నాయి. దొడ్డు వడ్లను రీసైక్లింక్ చేస్తూ దందాకు నడుపుతున్న ఘటనలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. దీని ద్వారా?. ప్రభుత్వ సొమ్ముకు భారీగానే గండి పడుతోంది. ఈ తరహా దందాకు అడ్డుకట్ట వేయడానికే సన్నవడ్లను ప్రోత్సహించే ఆలోచనలో సర్కార్ ఉందన్న అభిప్రాయాలు అధికారికవర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుంది. అకాల వర్షాల కారణంగా అనేక ప్రాంతాల్లో ఐకేపీ కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసిపోయింది. మరోవైపు తరుగు, తూకం పేరిట కోతలు విధిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఈసారి వర్షాలు ముందుగానే పడొచ్చు అని వాతావరణ శాఖ అంచనాలు ఉండటంతో?. రైతులు విత్తనాల కోసం కేంద్రాల వద్ద క్యూలు కడుతున్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీపై కసరత్తు చేయాల్సి ఉంది. ఇలాంటి కీలక సమస్యలు ఓవైపు ఉన్న నేపథ్యంలో?. తొందరపడి పంట బోనస్ పై ప్రకటన చేశారా అన్న చర్చ కూడా వినిపిస్తోంది. రాబోయే రోజుల్లో పంట బోనస్ పై అధికార పార్టీ నుంచి ఎలాంటి ప్రకటనలు వస్తాయనేది చూడాలి?.!

# ప్రభాకరరావుకు బ్లూ కార్నర్ నోటీసులు

**హైదరాబాద్ :** ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. మాజీ చీఫ్ ప్రభాకర్ అరెస్టుకు రంగం సిద్ధమయింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ కోసం పోలీసులు బ్లూ కార్నర్ నోటీసులు జారీ చేశారు. తెలంగాణ అఎఅ ద్వారా బ్లూ కార్నర్ నోటీసులు ఇష్యూ అయ్యాయి. నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి పారిపోయిన సందర్భంలో అతడికి సంబంధించిన సమాచారం. అతడు ఏ ప్రదేశంలో ఉన్నాడనే వివరాలను తెలుసుకోవడానికి విచారణలో భాగంగా బ్లూ కార్నర్ నోటీసులు జారీ చేస్తారు. ఈ నేపథ్యంలోనే ఇంటర్ నేషనల్ ఎయిర్ పోర్టులను అలెర్ట్ చేస్తారు. దీని ద్వారా అతడు ఏ ఎయిర్ పోర్టుకు వచ్చిన అదుపులోకి తీసుకునే అవకాశం ఉంటుంది. ఈ బ్లూ కార్నర్ నోటీసు నుంచి వచ్చే సమాచారం ఆధారంగా..తర్వాత రెడ్ కార్నర్ నోటీసు జారీ అవుతుంది. రెడ్ కార్నర్ నోటీసు సీబీఐ లేదా ఎన్ పోర్స్ మెంట్ డైరెక్టర్ ద్వారా జారీ చేస్తారు. అమెరికాకు సంబంధించిన ఇంటర్ పోల్ ద్వారా పోలీసులకు సమాచారం అందించి ఆ వ్యక్తిని నేరుగా ఎయిర్ పోర్టు నుంచి ఇండియాకు తీసుకు రావడానికి రెడ్ కార్నర్ నోటీసు ఉపయోగపడుతుంది. మొదటి దశగా మాజీ చీఫ్ ప్రభాకర్ కోసం బ్లూ కార్నర్ నోటీసు జారీ అయింది. బ్లూ కార్నర్ నోటీసులతో ఆయన అరెస్ట్ కు రంగం సిద్ధమయింది. జూన్ 2 తర్వాత ఇండియాకు వస్తానని మాజీ చీఫ్ ప్రభాకర్ పోలీసులకు తెలిపినా పోలీసులు ఆయనను విశ్వసించడం లేదు. కేవలం ప్రభుత్వం మారిపోతే ఫోన్






ట్యాపింగ్ కేసు బయట పడుతుందనే ఉద్దేశంతోనే అమెరికా వెళ్లిపోయారని పోలీసులు చెబుతున్నారు. వారు హైదరాబాద్ కు వస్తేనే కీలక విషయాలు బయటపడతాయని పోలీసులు భావిస్తున్నారు. అందులో భాగంగానే బ్లూ కార్నర్ నోటీసులు జారీ చేశారు. తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావును ప్రధాన నిందితుడిగా పోలీసులు తేల్చేశారు. అందులో భాగంగానే ప్రభాకర్ రావులను ప్రధాన నిందితుడిగా చేర్చుతూ కోర్టులో మెమో కూడా దాఖలు చేశారు. ప్రభాకర్ రావుతో పాటు ప్రయివేటు వ్యక్తిని కూడా నిందితుడిగా చేర్చారు. ప్రభాకర్ కనుసన్నల్లోనే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం జరిగిందని పోలీసులు నిర్ధారించారు. ఎస్ఐబీలోని హార్డ్ డిస్క్ ధ్వంసంలో ప్రధాన సూత్రదారి ప్రభాకర్ రావు అని, అతడి ఆదేశాలతోనే హార్ట్ డిస్క్ ప్రణీత్ రావు ధ్వంసం చేసినట్లు విచారణలో బయటపడింది. ఫోన్ ట్యాపింగ్ కేసు తర్వాత ప్రభాకర్ రావు అమెరికా వెళ్లి పోయాడు. దీంతో పోలీసులు ప్రభాకర్ రావు కోసం లుక్ అవుట్ నోటీసు జారీ చేసిన విషయం తెలిసిందే .

## 1 నుంచి ఐదు శాతం పెరగనున్న టోల్ చార్జీలు




**నల్గొండ :** దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై మళ్లీ టోల్ చార్జీలు పెరగనున్నాయి. ఏటా ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి పెరిగే టోల్ చార్జీలు పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో పెంపు వాయిదా పడింది. పెరిగిన టోల్ చార్జీలు జూన్ ఒకటో తేదీ అర్ధరాత్రి నుంచి అమల్లోకి రానున్నాయి. హైదరాబాద్ ? విజయవాడ జాతీయ రహదారిని బిఓటి పద్ధతిలో విస్తరణ పనులకు అయిన వ్యయాన్ని రాబట్టుకునేందుకు జిఎంఆర్ సంస్థ సిద్దమైంది. జాతీయ రహదారిపై ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చౌటుప్పల్ మండలం పంతంగి, కేతేపల్లి మండలం కొర్లపహాడ్, ఏపీలోని కృష్ణా జిల్లా చిల్లకల్లు వద్ద ఒకొక్కటి చొప్పున మూడు టోల్ప్లాజాలను జీఎమ్మార్ సంస్థ ఏర్పాటు చేసింది. వీటి ద్వారా 2012 నుంచి టోల్ఫీజు వసూళ్లను కాంట్రాక్టు సంస్థ ప్రారంభించింది. నేషనల్ హైవే అథారిటీ నిబంధనల మేరకు ప్రతిఏటా ఏప్రిల్ ఒకటో తేదీన టోల్ఫీజు ధరలను పెంచుకునే వెసులుబాటు జీఎమ్మార్ సంస్థకు ఎన్హెచ్ఏఐ కల్పించింది. అయితే ఈసారి పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో టోల్ చార్జీల పెంపును ఎన్నికల సంఘం వాయిదా వేయాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియాను ఆదేశించింది. దేశవ్యాప్తంగా ఏడు విడతల్లో ఎన్నికలు జరుగుతుండగా.. చివరి విడత జూన్ 1న ముగియనుంది. ఆ రోజు అర్ధరాత్రి నుంచి పెరిగిన టోల్ ధరలు అమల్లోకి వస్తాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఉన్న హైదరాబాద్–విజయవాడ (65), హైదరాబాద్–వరంగల్ (163) జాతీయ రహదారులపై వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. విజయవాడ –జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం పంతంగి, కేతేపల్లి మండలం కొర్లపహాడ్, ఏపీలోని చిల్లకల్లు(నందిగామ), వరంగల్ హైవేపై బీబీనగర్ మండలం గూడురు టోల్ప్లాజాలు ఉన్నాయి. రోజుకు పంతంగి టోల్ప్లాజా మీదుగా సుమారు 30 వేలకు పైగా, గూడురు టోల్ప్లాజా వద్ద 27వేల వాహనాలకు పైగా రాకపోకలు సాగిస్తుంటాయి. తాజాగా యాదాద్రి జిల్లా పంతంగి టోల్ ప్లాజా వద్ద పెరిగిన టోల్ చార్జీలు ఇలా ఉన్నాయి. కార్లు, జీపులు, వ్యాన్లకు రెండు వైపు ప్రయాణానికి రూ. 5, చిన్న లారీ 10 టైర్స్ పై10 రూపాయలు పెరిగాయి. వాణిజ్య, భారీ గూడ్స్ లారీలకు రూ. 15 రూపాయలు పెరిగింది. మొత్తం ఐదు శాతం మేర టోల్ చార్జీలు పెంచినట్టు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు తెలిపారు.

## కాకతీయలో కీలక ఫైళ్లు మాయం




**వరంగల్ :** కాకతీయ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ అవినీతి అక్రమాల వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. తాటికొండ రమేష్ అవినీతిపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించిన నేపథ్యంలో ఆయన ఉంటున్న లాడ్జి గది నుంచి ముఖ్యమైన ఫైల్స్ మాయమయ్యాయని అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ జనరల్ సెక్రటరీ మామిడాల ఇస్తారి మంగళవారం రిజిస్ట్రార్కు ఫిర్యాదు చేశారు. ప్రొ. రమేష్పై రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత విద్యా ముఖ్య కార్యదర్శి విజిలెన్స్ విచారణ కొరకు ఆదేశించిన సంగతి తెలిసిందే. అదే రోజు విద్యా శాఖ కార్యదర్శి కేయూ రిజిస్ట్రార్ మల్లా రెడ్డికి ఎటువంటి ఫైల్స్ ముట్టకూడదని మౌఖిక ఆదేశాలిచ్చినట్టు ఇస్తారి తెలిపారు. 20వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో యూనివర్సిటీ నుంచి పలు ఫైళ్లు బయటకు వెళ్లాయని ఇస్తారి ఆరోపించారు. విషయం తెలుసుకున్న అకుట్ కమిటీ పరిపాలన భవనానికి చేరుకొని రిజిస్ట్రార్ను నిలదీసినట్లు తెలిపారు. వీసీ రమేష్ గత నాలుగు రోజుల నుంచి కేయూకు రావట్లేదని, విజిలెన్స్ విచారణలో అవసరమయిన ఫైళ్లను తారుమారు చేసేందుకు ఇంటికి తరలించారని ఆరోపించారు. ఉన్నత విద్యాశాఖ నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నా ఫైళ్లను బయటకు తీసుకు వెళ్లడంపై ఇస్తారి అనుమానం వ్యక్తం చేశారు. గత మూడేళ్లలో వీసీ తన పాలనను లాడ్జీ నుండే కొనసాగించారని ఆరోపించారు. లాడ్జి నుంచి తరలించిన ఫైళ్లలో పలు మార్పులు చేసే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. వివిధ డీన్ల వద్ద నున్న పీహెచ్డీ, పార్ట్ టైం ఫుల్ టైమ్ అడ్మిషన్లకు సంబంధించిన ఫైళ్లు, విద్యార్థులకు వచ్చిన మార్కుల లిస్ట్, కంప్యూటర్ కొనుగోలుకు సంబంధించిన అప్రూవల్ ఆర్డర్లను మార్చే అవకాశం ఉందని ఇస్తారి ఆరోపించారు. వీసీకి సంబంధించిన సొంత పుస్తకాలు, మెమెంటోలు, వ్యక్తిగత సామానులు తీసుకువెళ్లి ఉండొచ్చని రిజిస్ట్రార్ చెప్పిన మాటలను ఆకుట్ ఖండిస్తుందని ఇస్తారి చెప్పారు. వీసీ ఉన్న లాడ్జి సీసీ ఫుటేజీని విడుదల చేసి ఫైళు మాయం చేసిన వారిని శిక్షించాలని రిజిస్ట్రార్కు ఫిర్యాదు చేశారు. కేయూ పోలీస్ స్టేషన్లో కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. గత మూడేళ్లలో కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్. తాటికొండ రమేష్ మీద అవినీతి ఆరోపణలు ఉన్నాయి. అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యునివర్సిటీ టీచర్ల సంఘం జనవరిలో సీఎం రేవంత్ రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శికి రెండు సార్లు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం కేయూ వీసీపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం మే 18న ఆదేశాలు జారీ చేశారు. వర్సిటీ టీచింగ్ స్టాఫ్ సంఘం జనరల్ సెక్రటరీ మామిడాల ఇస్తారి మాట్లాడుతూ గత మూడేళ్లలో వీసీ ప్రొ. తాటికొండ రమేష్ టీచర్లు, విద్యార్థుల వ్యతిరేక విధానాలను అనుసరించారని ఆరోపించారు. ఆయన పలు అక్రమాలకు పాల్పడ్డారని, గతంలో కేయూ పాలక మండలికి పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. చివరకు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు.

## స్వయం సహాయక సంఘాలకు స్కూళ్ల బాధ్యత

**హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతను స్వయం సహాయక సంఘాలకు అప్పగించింది. పాఠశాల స్థాయిలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు వేయాలని అందులో ఇందు కోసం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలే అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులను అమలు చేయడం, పర్యవేక్షించడం, బలోపేతం చేయడం వంటి పనులు చూసుకుంటాయి. పాఠశాల నిర్వహణ, విద్యార్థులకు పాఠశాలల యూనిఫామ్లు, మధ్యాహ్న భోజనం వంటివి అందించడంతో పాటు అన్ని ప్రభుత్వ పారిశుద్ధ్య పనులను అమ్మ ఆదర్శ కమిటీలే తీసుకుంటాయి. బాలికల మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి సౌకర్యాలు కల్పించడం, చిన్న, పెద్ద మరమ్మతు పనులను చేపట్టడం, ఇప్పటికే ఉన్న, పనిచేయని టాయిలెట్ల పునరుద్ధరణ, నిర్వహణ, తరగతి గదుల విద్యుద్దీకరణ, స్కూలు ఆవరణలో పరిశుభ్రతగా ఉండేలా చూడడం, విద్యుత్ బిల్లులను తగ్గించేందుకు సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు, స్కూలు భవనం మొత్తం నిర్వహణ, విద్యార్థులకు యూనిఫారాలు కుట్టించడం వంటి బాధ్యతలను కూడా ఈ కమిటీలకే అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించారు. అమ్మ ఆదర్శ పాటశాల కమిటీలు ప్రతి స్కూలు స్థాయిలో మహిళ స్వయం సహాయక బృందాల నుంచి ఎంపిక చేస్తారు. గ్రామ సంస్థ లేదా ఏరియా స్థాయి సమాఖ్య ప్రెసిడెంట్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు స్కూలు హెడ్ మాస్టర్ మెంబర్ కన్వీనర్గా ఉంటారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టే అన్ని కార్యక్రమాలను సమన్వయం చేసుకుంటారు. ఇలా చేయడం వల్ల వారికి ప్రభుత్వం కొంత మొత్తం చెల్లిస్తుంది. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలలపై నిరంతర పర్యవేక్షణ ఉండడంతో పాటు మహిళలకు ఆర్థికంగా చేయూతను అందించినట్టు అవుతుందని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారు.